ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



'రెడ్‌క్రాస్'లో తలసేమియా బ్లాక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కలెక్టర్లు, అధికారులు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి



భద్రకాళి దేవాలయంలో గవర్నర్ పూజలు

- అప్పుడే అసలైన ప్రగతి సాధ్యం
- వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలి
- మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి
- ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి
- ఓరుగల్లు విశిష్టమైన నగరం
- కాకతీయుల కట్టడాల సందర్శనతో దివ్యానుభూతి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నగరంలో విస్తృత పర్యటన
- కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, కళాకారులతో భేటీ
- సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- హాజరైన మంత్రులు పొంగులేటి, సీతక్క పొన్నం ప్రభాకర్

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుతో పాటు సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని అప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడిజిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించిన ఆయన లక్నవరం టూరిజం కాటేజీలో బస చేశారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి హనుమకొండ చేరుకుని.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అది సుస్థిరమైనప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. అధికారుల కర్తవ్య నిర్వహణ ఈ దృష్టి కోణం నుంచే జరగాలని ఉద్బోధించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, జలవనరులను కాపాడుకోవడం, వ్యర్థాల నుంచి పునరుత్పాదకత సాధన, ఇంధన వనరుల పొదుపు వాడకం వంటి వాటి ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. పీఎం కుసుమ్ యోజన పథకం గురించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ పథకం అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అందుకు కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని పెంచాలని గవర్నర్ జిష్ణు దేవ్ కోరారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తోందని, ఈ క్రమంలో విద్యుత్ వాడక భారాన్ని తగ్గించేందుకు రైతులు కుసుమ్ యోజన పథకం కింద సౌర విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసే దిశగా కృషి జరగాలని గవర్నర్ సూచించారు. ఎస్‌హెచ్‌జీలను మరింత క్రియాశీలకంగా మార్చడం స్వచ్ఛభారత్‌లాగా ఒక ఉద్యమంలాగా సాగాలన్నారు. కొన్ని ఈ కామర్స్ సంస్థల వల్ల ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులు మార్కెట్‌లో పోటీని తట్టుకొని నిలబడలేకపోతున్నాయని, ఈ క్రమంలో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల మార్కెట్ విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల విక్రయానికి హైదారాబాద్‌లో ఒక విశాలమైన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని గవర్నర్‌కు వివరించారు.

అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య.. రెండు జిల్లాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, జరుగుతున్న పనులు, విద్య, వైద్యం, ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, ఐసీడీఎస్, వ్యవసాయం, ఏనుమాముల మార్కెట్ తదితర శాఖల గురించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణ విధానం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ పనులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిత కూరగాయల మార్కెట్లు, పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..



వేయి స్తంభాల దేవాలయంలో..



కోటలో పేరిణీ నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నేడు జనగామకు గవర్నర్

- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం
- ఓబుల్‌కేశవాపూర్ గ్రామస్థులతో పరిచయ కార్యక్రమం
- ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

వివరాలు 8లో..

గ్రంథాలయాల్లో అందుబాటులోకి మరిన్ని పుస్తకాలు

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్



పాలకుర్తి గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రియాజ్

పాలకుర్తి, ఆగస్టు 28 : పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువకులకు అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పోటీ పరీక్షలకు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న యువకులు, విద్యార్థుల కోసం మరిన్ని పుస్తకాలను అందచేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉందని చాకలి ఐలమ్మ పోరాడిన గడ్డపై యువకులు, విద్యార్థులు కష్టపడి చదవాలని ఆయన సూచించారు. అవసరమైతే ఈ గ్రంథాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టేలా కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేసి నూతన గ్రంథాలయ భవనం నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుధీర్‌కుమార్, సిబ్బంది కమ్మగాని శ్రావణ్‌కుమార్, పాఠకులు జీవంజి వినయ్, రాంచందర్, నరేష్, ఉపేందర్, శ్రావణ్ ఉన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, ఆగస్టు 28: ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ షేక్ బాషా రిజ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచె రాములు మాట్లాడుతూ జనగామ పట్టణంలోని పలు చెరువులు కబ్జాలకు గురయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో అధికార పార్టీ అండదండాలతో పలువురు రాజకీయ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రేపు 'దేవాదుల'కు మంత్రి ఉత్తమ్ రాక



ములుగు, ఆగస్టు 28: సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ములుగు జిల్లాకు రానున్నారు. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌస్, తుపాలకుగూడెంలోని సమ్మక్క బ్యారేజీని సందర్శిస్తారు. ఉదయం 9 గంటలకు దేవాదులకు హెలిక్యాప్టర్ ద్వారా చేరుకోనున్న మంత్రి ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలించిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పలు అంశాలను సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మంత్రి పర్యటన కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నర్మెట, ఆగస్టు 28 : కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని, అప్పుడే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్మెట మండలకేంద్రం శివారులో ఓ పెట్రోల్ బంక్ ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు, రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ మాట నిలబెట్టుకుంటుందన్నారు. రైతులకు ఇప్పటికే 17 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ కాలేదని, కారణాలు తెలుసుకొని అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో రోడ్ల సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు అందడంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మండలకేంద్రంలో ఇటీవల మృతిచెందిన కందకట్ల లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్. లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు గొల్లపల్లి కుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, నాయకులు భూక్యా జయరాం, భైరడోని అంజయ్య, పరీదుల యాదయ్య, చెవుల పరుశరాములు, వంగ భూపాల్‌రెడ్డి, గొల్లపల్లి బాలచందర్, రాజేష్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సోమయ్య
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



జఫర్‌గడ్‌లో తహసీల్దార్ శంకరయ్యకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, నాయకులు

జఫర్‌గడ్, ఆగస్టు 28: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతుల రుణమాఫీ అంశంపై సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు ఏకకాలంలో రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. అయితే గద్దెనెక్కగానే హామీకి విరుద్ధంగా అమలులో నిబంధనలు విధించి, కొర్రీలు పెట్టి రుణమాఫీ రైతుల సంఖ్యను కుదించడం అన్నదాతలను మోసం చేయడమేనన్నారు. రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శంకరయ్యకు నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వీకే సుధాకర్, శ్రీను, గంగరాజు, వేల్పుల సంపత్, రవి, శంశోద్దీన్, నక్క యాకయ్య, రామన్న, అజయ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి


అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లకు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తెలిపారు. గవర్నర్ పర్యటన సందర్భంగా బుధవారం మండలంలోని ఓబుల్‌కేశ్వపూర్‌లో అదనపు కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ మధ్యాహ్నం ఒంటి గంటకు ఓబుల్ కేశ్వపూర్ చేరుకుంటారని తెలిపారు. అధికారులు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జేడ్పీ సీఈవో సరిత, డీపీవో స్వరూప. డీఆవో రాము, తదితరులు పాల్గొన్నారు.





రోహిణి ఆస్పత్రిపై ఆరోపణలు నిరాధారం

వరంగల్ మెడికల్, ఆగస్టు 28: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను స్వాహా చేసినట్లు తమపై వచ్చిన ఆరోపణలను రోహిణి ఆస్పత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ క్రాంతిరావు, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ బోస్ బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మధ్య తమ ఆస్పత్రిపై వస్తున్న కథనాలను, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2023 మే మాసంలోనే విచారణ అధికారులు తమ ఆస్పత్రిని సందర్శించారని, బిల్లులను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఆరోపణల్లో చూపబడిన బిల్లులు ఆస్పత్రికి సంబంధించినవి కాదని రికార్డుల ద్వారా స్పష్టం చేశామని తెలిపారు. అదే విధంగా ఆ బిల్లులో పేర్కొన్న రోగులు ఎవరూ ఆస్పత్రి అడ్మిట్ కార్డుల్లో లేరని విచారణ అధికారులకు స్పష్టం చేశామన్నారు. ఆ బిల్లులో చికిత్స చేసినట్లు చెబుతున్న వైద్యులు కూడా తమ ఆస్పత్రిలో ఏనాడు పనిచేయలేదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ ప్రజలందరూ ఇలాంటి ఆరోపణలు నమ్మవద్దని వారు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న రోహిణి ఆస్పత్రి యాజమాన్యం

పాడి గేదెలను అపహరించిన దొంగలు

మడికొండ, ఆగస్టు 28: పాడి గేదెలను దొంగలు అపహరించిన ఘటన కాజీపేట మండలం రాజీవ్ గృహకల్ప(కడిపికొండ) వద్ద జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ గృహకల్ప వద్ద కొంతకాలంగా షఫియుద్దీన్ అనే రైతు కాకతీయ గేదెల డైయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు డెయిరీ ఫామ్‌లోని రెండు పాడి గేదెలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న రైతు.. బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదుతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజబాబు బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకొని గేదెలను స్వాధీనం చేసుకుంటామని ఇన్‌స్పెక్టర్ కిషన్ స్పష్టం చేశారు.

కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు హైకోర్టులో చుక్కెదురు

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కాకతీయ యూనివర్సిటీ కేటగిరీ 1, 2 అడ్మిషన్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఆధారంగా ఇప్పుడున్న సీట్లను భర్తీ చేయడంపై హైకోర్టు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అడ్మిషన్లలో పారదర్శకత, లేదని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి చల్లా అమరేందర్‌రెడ్డి కోర్టుమెట్లెక్కారు ఆయన అప్పీల్‌తో స్పందించిన హైకోర్టు.. తమ తదుపరి ఉత్తర్వులు వెల్లడించే వరకు ఎలాంటి పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టరాదని కరాఖండిగా హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, 2020-2021 ఏడాదిలో కేయూ అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఇప్పటివరకు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని కేయూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇది వివాదాస్పదమైంది, కేటగిరీ, 1, 2 అడ్మిషన్లలో పారదర్శకత లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు అడ్మిషన్లకు మోకాలడ్డటంతో కేయూలో చర్చనీయాంశమైంది. దీంతో విద్యార్థులు కేయూ దూర విద్య కేంద్రం ఎదుట ఆందోళనలు, దీక్షలు చేపట్టారు. అదే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి ఇచ్చిన హామీ మేరకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని వర్సిటీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అడ్మిషన్ల ప్రక్రియ సందిగ్ధంలో పడింది.

కేయూ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కేయూ బీఏ, బీకామ్, ఇతర రెగ్యులర్ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 28శాతం, నాలుగో సెమిస్టర్‌లో 36 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు. డాక్టర్ ఎం.తిరుమలాదేవి, డాక్టర్ అసీం ఇక్బాల్, సమ్మయ్య, ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేయూ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి















సంస్కృతికి చిహ్నాలు పురాతన ఆలయాలు

● వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ● రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ



వేయిస్తంభాల ఆలయంలో శిల్పకళను పరిశీలిస్తున్న గవర్నర్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచీన ఆలయాలు చిహ్నాలుగా విరాజిల్లుతున్నాయని, కోట్లాది మంది ప్రజల హృదయాల్లో కొలువైన రుద్రేశ్వరుడిని దర్శించుకోవడం గొప్ప అనుభూతి కలిగించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మేయర్ గుండు సుధారాణి తదితర ప్రముఖులతో కలిసి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన గవర్నర్‌కు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠ శర్మ, ప్రణవ్‌శర్మ, ఇతర వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి అభిముఖంగా ఉన్న శిల్పకళాశోభిత నందీశ్వరుడిని, ఉత్తిష్ఠ గణపతిని దర్శించి రుద్రేశ్వరుడి సన్నిధిలో శివ పంచాక్షరి మంత్రంతో బిల్వ దళార్చన చేశారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో వేద పండితులు గవర్నర్ ఇతర ప్రముఖులకు వేయిస్తంభాల ఆలయ సుందర చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ బృందం ఇటీవల పూర్తయిన కల్యాణ మండపం అందాలను, పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. వేయిస్తంభాల గుడి లాంటి ఆలయాలను చరిత్ర మరుగున పడకుండా భవిష్యత్‌తరాల వారు తెలుసుకునేందుకు వీలుగా నిత్యనూతనంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో శిల్పకళానైపుణ్యం అద్భుతమని, ఎందరో చిత్రకారులు, శిల్పులు అద్భుతంగా చెక్కిన రూపాలు అలనాటి కాకతీయుల ప్రతిభతో పాటు సమాజ శ్రేయస్సు చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సిరిసిల్ల రాజయ్య, ప్రొఫెసర్ పాండురంగారావు, హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, పురావస్తు శాఖ అధికారి మల్లేశం, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాల సునిత, ఈవో వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గవర్నర్ బృందం అరగంట పాటు ఉల్లాసంగా గడిపింది.



కల్యాణమండపం నందీశ్వరుడి వద్ద గవర్నర్..

భద్రకాళికి గవర్నర్ పూజలు



గవర్నర్‌కు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 28: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని చరిత్రాత్మక కట్టడాలు, ఆలయాల సందర్శనలో భాగంగా బుధవారం సాయంత్రం భద్రకాళి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చక బృందం, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునీత స్వాగతం పలికారు. వేదమంత్రాలతో, మేళ తాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత గవర్నర్ గణపతి స్వామిని దర్శించుకొని అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రధానార్చకులు గవర్నర్‌కు అమ్మవారి కుంకుమధారణ చేసి శేషవస్త్రాలు అందజేశారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, నగరమేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడేలకు అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. ఈవో శేషుభారతి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అమ్మవారి చరిత్రను ప్రధానార్చకులు గవర్నర్‌కు ఆంగ్లంలో వివరించారు. అయితే షెడ్యూల్‌ప్రకారం గవర్నర్ సాయంత్రం 4గంటలకు దేవాలయానికి రావాల్సి ఉండగా 5గంటలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాలు ఆలయంలో గడిపారు. గవర్నర్ రాక సందర్భంగా దేవాలయాన్ని పూల మాలలతో అరటి బోదెలతో అలంకరించారు.

అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, దేవాలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా కనిపిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రకాళి అమ్మవారి దర్శనం అనంతరం ఖిలా వరంగల్ కోటకు వెళుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలు, అభివృద్ధిని తిలకిస్తున్నానని, ఆలయాల సందర్శనం, సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతలను తెలుసుకుంటున్నానన్నారు.



భద్రకాళి ఆలయంలో గోశాల వద్ద గవర్నర్..

కాకతీయుల కట్టడాలను ముందుతరాలకు అందించాలి



కళాతోరణం వద్ద గవర్నర్, మంత్రులు



ఖిలావరంగల్, ఆగస్టు 28: కాకతీయుల అద్భుత కళాఖండాలు, కట్టడాలను ముందుతరాలకు అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం వరంగల్ మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కళాఖండాలు, కట్టడాలు, శిల్ప సంపదలను ఆసక్తిగా తిలకించారు. శిల్పాల ఆవరణలోని కాకతీయుల కీర్తితోరణం, రాతి కట్టడాలను తిలకించి పులకించారు. కీర్తితోరణం ముందు ఫొటోలు తీసుకున్నారు. అనంతరం స్వయంభూ - శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్‌కు కళాకారుడు గడ్డం సుధాకర్ బృందం బోనాలు, బతుకమ్మలు, కోలాటం డప్పుచప్పుళ్ల తదితర కళాకారుల నృత్యాలతో ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు స్వాగతం పలికారు. ఆవరణలో పేరిణి శివతాండవాన్ని గజ్జెల రంజిత్ బృందం, చిందు యక్షగానం గజవెల్లి దామోదర్ బృందం, రాణిరుద్రమదేవి నృత్యప్రదర్శన సుధీర్‌రావు బృందం ప్రదర్శించింది. పెండ్యాల లక్ష్మీప్రియ బాలపురస్కార్ అవార్డు గ్రహీను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాకారులను శాలువాలతో సన్మానించారు. కోటలో గవర్నర్ పర్యటనలో భాగంగా స్పెషల్ పార్టీ, వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వచ్చిన గవర్నర్ 7.10 వరకు కోటను సందర్శించారు.

వరంగల్ కోట సందర్శనలో గవర్నర్

కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూర్య సీతక్క, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, కేంద్ర పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ హెచ్‌ఆర్ దేశాయ్, జిల్లా అధికారి మల్లేశం, పర్యా టక శాఖ జిల్లా అధికారి శివాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నాయకులు వన్నాల వెంకటరమణ, కుసుమ కుతీష్, సీపీ అంబర్ కిషోర్ ఝా, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్ కోటలో పేరిణి నృత్య ప్రదర్శన

గవర్నర్‌కు స్వాగతం పలికిన కొండా

కోటకు వచ్చిన గవర్నర్‌కు మధ్యకోటలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఘనస్వాగతం పలికారు. బొకే ఇచ్చి, సత్కరించారు. 37,38 డివిజన్‌ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ-జనార్దన్ స్వాగతం పలికారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కొండా మురళీధర్‌రావు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం తదితర అంశాలను వివరించారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిని సీపీ అంబర్ కిశోర్ ఝా వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధరంగాలకు చెందిన సుప్రసిద్ధ కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులతో గవర్నర్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారితో ముచ్చటించారు.

వరంగల్ విశిష్ట నగరం

వరంగల్ అనేక ప్రాచీన దేవాలయాలు, వారసత్వ కట్టడాలు ఉన్న సుప్రసిద్ధ, చారిత్ర నగరమని, భవిష్యత్తులో మరింత సుస్థిరాభివృద్ధిని సాధించాలన్న ఆకాంక్షను గవర్నర్ వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తనకు తన ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం నగర విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి తెలిపారని, వ్యవసాయరంగంలోనూ జిల్లా ముందుండాలని ఆకాక్షించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నందుకు అధికారులను అభినందించారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తాను ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించానని, ఆస్పత్రి ఎంతో పరిశుభ్రంగా ఉండడం తనను ఆకట్టుకుందన్నారు. జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ స్వాగతించారు. కాకతీయులు ఏలిన గడ్డ ఓరుగల్లులో పర్యటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంతా యువ అధికారులే ఉన్నారని, వీరి నేతృత్వంలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడి చారిత్రక కట్టడాలను చూసేందుకు ఈ జిల్లాలకు మరోసారి వస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలపై తనను స్వేచ్ఛగా కలవవచ్చునని, రాజ్‌భవన్ ద్వారాలు సదా తెరిచి ఉంటాయని గవర్నర్ స్పష్టం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

హనుమకొండ, వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఎన్ఐటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదా, కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎఫ్‌వోలు అనుజ్ అగర్వాల్, లావణ్య, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులతో గవర్నర్ కొద్ది సేపు సమావేశం అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా అభివృద్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చారిత్రకంగా ఈ రెండు జిల్లాల ప్రాశస్త్యం గురించి ఆసక్తిగా ఆరా తీశారు.

సాంస్కృతిక కళా రంగంలో ఓరుగల్లు స్థానం అద్భుతం

ఉమ్మడి జిల్లా జిల్లా ప్రముఖులతో గవర్నర్



రచయిత, కార్టూనిస్టు రమాదేవితో మాట్లాడుతున్న గవర్నర్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: తెలంగాణ ప్రాంతంలోనే సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో ఓరుగల్లు స్థానం అద్భుతమని, భిన్నరంగాల ప్రముఖలను కలుసుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం ఉమ్మడి జిల్లాకు చెందిన భిన్న రంగాల ప్రముఖులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరిని పేరుపేరునా ప్రస్తావిస్తూ కళ, సాహిత్య ఇతర రంగాలలో వారి కృషిని ప్రశంసించారు. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, డాక్టర్ లంక శివరామప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత గడ్డం కేశవమూర్తి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవితో మాట్లాడారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు లోహిత్ కుమార్, జాతీయ నృత్యకళాకారిణులు వెంపటి శ్రావణి, కాట్రగడ్డ హిమాన్సీ, పేరిణి నృత్యాన్ని జాతీయస్థాయిలో ప్రదర్శిస్తున్న గజ్జెల రంజిత్‌కుమార్, నాటక రంగ ప్రముఖుడు వనం లక్ష్మీకాంతరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ శేషుమాధవ్, కాళీచరణ్, క్రీడారంగం నుంచి సారంగపాణి, ఎం.డి.అజీజ్‌ఖాన్, మహిళా శక్తి అవార్డు గ్రహీత కొంగ రజిని, సామాజిక రంగం నుంచి మండల పరశురాములు, చేనేత రంగం నుంచి జాతీయ అవార్డు గ్రహీత పిట్టల రాములు, తదితర 40 మంది ప్రముఖులను గవర్నర్ కలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

6న హాజరు కావాలని సీపీకి హైకోర్టు నోటీసులు

వరంగల్ క్రైం, ఆగష్టు 28: ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ పెన్షన్ విషయంలో సీపీ అంబర్ కిషోర్ ఝాకు రెండు రోజుల కిందట హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన యాదాద్రి అనే కానిస్టేబుల్ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అతడి భార్య సంతకం కావాలని కమిషనరేట్ అధికారులు సూచించారు.

కుటుంబ కలహాలతో యాదాద్రి భార్య కేసు వేసిందనే కారణంతో పెన్షన్ జారీ విషయంలో కమిషనరేట్ అధికారులు జాప్యం చేశారు. పెన్షన్ జాప్యం కావడంతో కానిస్టేబుల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో పెన్షన్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కమిషనరేట్ కార్యాలయం నుంచి స్పందన లేకపోడంతో కానిస్టేబుల్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. సీపీని కానీ, ఆయన తరపున న్యాయవాది హాజరు కావాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 28: హనుమకొండ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226049కు ఫోన్ చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం, 2వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మణిషా శ్రవణ్ ఉన్నమ్ బుధవారం తీర్పుచెప్పారు. బాధితురాలికి రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ రామన్నపేటకు చెందిన బాలికను నమ్మించి వరంగల్ పట్టణ పాపయ్యపేట చమన్ ప్రాంతానికి చెందిన రామరూపుల ప్రభుచరణ్ చెట్ల పొదలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీన్ని గమనించిన బాలిక తల్లిదండ్రులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. నిందితుడిపై పోక్సో చట్టం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల నగదు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీలు పి.రఘు, శ్రీనివాస్, లైజన్ అధికారి ఎం.వెంకటస్వామి సాక్షులను ప్రవేశపెట్టారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్‌హెచ్‌వో టి.గోపి, ఏసీపీ డి.చంద్రయ్య వ్యవహరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,911	2,700
పల్లికాయ (సూక)	6,300	5,400
పల్లికాయ (పచ్చిది)	4,000	3,000
కందులు	8,552	8,552
పెసళ్లు	6,252	2,552
పత్తి	7,560	5,000
పసుపు (కాడి)	12,459	10,000
పసుపు (గోల)	12,059	11,409
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	17,500	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరు పెట్టాలి

తెలంగాణ ఆదికవికి పట్టం కట్టడం చారిత్రక అవసరం

సాహిత్యంలో బహుజనులకు స్థానం కల్పించింది సోమనాథుడే

సీఎం రేవంత్‌రెడ్డికి సాహితీ వేత్తలు, కవుల విజ్ఞప్తి



పాలకుర్తి, ఆగస్టు 28 : తెలంగాణ ఆదికవి, బహుభాషా కోవిధుడు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు. తెలుగు, సంస్కృతం, కన్నడం, మలయాళం, మరాఠీ, తమిళం లాంటి భాషల్లో ప్రావీణ్యం కలిగిన ఆయన తెలంగాణ ప్రాంతానికి కీర్తి ప్రతిష్ఠలను తెచ్చి దేశ వ్యాప్తంగా పరిచయం అక్కరలేని కవిగా గుర్తింపు పొందాడు. అలాంటి కవికి స్వరాష్ట్ర ప్రభుత్వం పట్టం కట్టాల్సిన చరిత్రక అవసరం ఉందని సాహితీవేత్తలు, కవులు కోరుకుంటున్నారు. దేశ ప్రథమ కవుల్లో ఒకరైన 11వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడిది ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి ఆయన స్వగ్రామం. బసవ పురాణం, వృశాధిప శతకం, పండితారాధ్య చరిత్ర లాంటి అనేక ప్రాముఖ్య గ్రంధాలు రాశాడు. పాల్కురికి సోమనాథుడికి ఆయన రాసిన సాహిత్యంపై పాలక వర్గాలు అనేక దశాబ్దాలుగా శీతకన్ను చూపుతున్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన కవిగా నిర్లక్ష్యానికి అవహేళనకు, ప్రాంతీయతకు గురయ్యారు. అది నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆయనను కేవలం వీరశైవ సాహిత్యానికి పరిమితం చేసి చరిత్ర కారులు సాహిత్య వేత్తలు తీవ్ర అన్యాయం చేశారు. అనువాద కవులకిచ్చిన ప్రాధాన్యం స్వతంత్ర కవులకు ఇవ్వడం లేదన్న బలమైన విమర్శ ఉంది. సోమనాథుడు సకల ఆధిపత్యాలను తిరస్కరించిన తొలి తెలుగు కవి. అణగారిన తరగతులకు తీవ్ర వివక్షకు గురవుతున్న శ్రామిక జనాలకు సాహిత్యంలో స్థానం కల్పించిన విప్లవ కవి సోమనాథుడు. దేశీయతకు పట్టం కట్టి నూతన ఒరవడులకు జీవం పోశాడు. సంప్రదాయాలను కాలదన్ని సమానత్వం చాటి చెప్పాడు. సమాజ మార్పును ఆకాంక్షించాడు. ఆ రోజుల్లో అది విప్లవకరమైన పరిణామం. అలాంటి సోమనాథుడి సమగ్ర సాహిత్యాన్ని విస్తృతంగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఆగస్టు 2న అసెంబ్లీలో సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి అందరూ ఆమోదం తెలిపితే తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రతాపరెడ్డి పేరు పెడతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొన్ని వర్గాల నుంచి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలని ప్రతిపాదనలు వచ్చాయి. పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం లాంటి సంస్థ స్పందించి పాలమూరు విశ్వవిద్యాలయానికి లేదా మీడియా అకాడమీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును సూచించింది. అయితే ఈ కాంక్ష ఇప్పటిది కాదని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆదికవిగా పాల్కూరికి సోమనాథుడిని గుర్తించాలని ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, కవులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోమనాథుడి పేరు పెట్టాలి

మామిండ్ల రమేష్‌రాజా, కవి, రచయిత పాలకుర్తి,



తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలి. స్వరాష్ట్రంలో పాలకులు పెడుతారని తెలంగాణ ఉద్యకారులు, సాహితీ వేత్తలు, ఆశించారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కాలం పూర్తయినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తెలుగు యూనివర్సిటీకి పాల్కురికి సోమనాథుడి పేరు నామకరణం చేస్తే సముచిత గౌరవం ఉంటుంది.

ఇతర వ్యక్తుల పేర్లు పెడితే తప్పిదం జరిగినట్లే

వీరమనేని వెంకటేశ్వర్‌రావు,

సోమనాథ కళాపీఠం బాధ్యుడు, పాలకుర్తి



హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఇతర వ్యక్తుల పేర్లు పెట్టినట్లయితే ఉమ్మడి పాలకులు చేసిన తప్పిదాన్ని కొనసాగించినట్లే అవుతుంది. తెలంగాణ ఆది కవి, తొలి తెలుగు స్వతంత్ర కవి, విప్లవ కవి పాల్కురికి సోమనాథుడి పేరు మాత్రమే సమంజసమైంది.

సోమనాథుడి పేరు పెట్టడమే సమంజసం

రాపాక సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలకుర్తి



తెలుగు విశ్వవిద్యాలయానికి బసవపురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టడమే సరైన నిర్ణయం. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న యూనివర్సిటీలకు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి. బడుగు వర్గాల కష్టాలను సాహిత్యంలో స్థానం కల్పించిన సోమనాథుడికే ఆ పట్టం దక్కాలి.



నిరసన వ్యక్తం చేస్తున్న ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు

ఫర్టిలైజర్ దుకాణదారుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, ఆగస్టు28: ఫర్టిలైజర్ దుకాణదారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వ్యాపారులు ఫర్టిలైజర్ దుకాణాలను బంద్ చేసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియా ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఒక బస్తాకు రూ. 35 నుంచి 50 వరకు చెల్లించాలని, హమాలీ చార్జీలను ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 6 లక్షల టన్నుల యూరియా బఫర్ స్టాక్ పేరుకుపోయి ఉండటం వలన ప్రైవేట్ డీలర్లకు రావాల్సిన యూరియాను కంపెనీలు అలాట్మెంట్ చేయడం లేదని వెంటనే యూరియాను ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయాలని ఆయన కోరారు.

బాలికల గురుకులాన్ని పరిశీలించిన తహసీల్దార్



గూడూరులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో వంటశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పాలకుర్తి, ఆగస్టు 28 :మండలంలోని గూడూరు గిరిజన బాలికల గురుకుల పాఠశాలను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజనం ఎలా ఉంటుందని, మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రేణుకను ఆదేశించారు. కొత్త బియ్యం సరఫరా చేస్తుండడంతో భోజనం కొంచెం మెత్తగా అవుతుందని చెప్పడంతో స్టేషన్‌ఘన్‌పూర్ గోదాం ఇన్‌చార్జితో మాట్లాడి మంచి బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ రాకేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిలుపూర్ వ్యవసాయాధికారిగా నజీరొద్దీన్



నజీరొద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈవోలు

చిలుపూర్, ఆగస్టు 28 : మండల వ్యవసాయ అధికారి (ఎంఏవో)గా ఎమ్డీ నజీరొద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లాలో ఏవోగా పని చేసిన నజీరొద్దీన్ బదిలీపై చిలుపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నపెండ్యాల, చిలుపూర్, మల్కాపూర్, లింగంపల్లి క్లస్టర్లకు చెందిన ఏఈవోలు బూర్ల నర్సింహులు, జయశ్రీ, వినయ్‌కుమార్, యాకూబ్‌లు ఏవో నజీరొద్దీన్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కాగా, మండలం ఏర్పడి ఎనిమిదేళ్ళు కావస్తున్నప్పటికీ ఏఈవోలతోనే ఇప్పటివరకు కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం పూర్తి స్థాయి ఏవోను నియమించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జనగామకు గవర్నర్

● కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం ● ఓబుల్‌కేశవాపూర్ గ్రామస్థులతో పరిచయ కార్యక్రమం ● ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

జనగామ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడురోజుల పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం జనగామ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌తో పాటు జనగామ ఓబుల్‌కేశవాపూర్‌లో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గవర్నర్ ఉదయం 9 గంటలకు వరంగల్ నిట్ నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు జనగామ కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఆయనకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్ స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. ఆ తర్వాత జాతీయ గీతాలాపన చేస్తారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్, జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అనంతరం 15 నిమిషాల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్ తిలకిస్తారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో పరిచయ కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి భోజనం చేస్తారు.

మధ్యాహ్నం 12.50 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం స్వగ్రామమైన జనగామ మండలం ఓబుల్ కేశవాపూర్‌కు 1.10 గంటలకు చేరుకుంటారు. గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి 8వ వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 'స్వచ్ఛదనం-పచ్చదనం' లో భాగంగా మొక్కలు నాటుతారు. ఆ తర్వాత టెంపుల్ గెస్ట్‌హౌజ్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత పక్కనే ఉన్న ఓపెన్ ఆడిటోరియానికి చేరుకొని గ్రామస్థులతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో అరగంట పాటు పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు జనగామ జిల్లా పర్యటన ముగించుకొని బచ్చన్నపేట మండలకేంద్రం మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకకు బయలుదేరి వెళ్తారు.

పోలీసుల భారీ బందోబస్తు

గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకు వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీసు సిబ్బందిని కేటాయించారు. గవర్నర్ వచ్చి వెళ్లే మార్గాలను 15మందితో కూడిన డాగ్ స్క్వాడ్ బృందం జల్లెడ పట్టింది. ఒక డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 10 మంది సీఐలు, 22 మంది ఎస్సైలు, 215 మంది పోలీస్ కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించనున్నారు. వీరితో పాటు ఆయనకు గౌరవ వందనం చేసేందుకు 16 మంది ఏఆర్ సిబ్బందిని కేటాయించారు. అలాగే ప్రత్యేక అంబులెన్స్‌లో నలుగురు వైద్యులతో కూడిన బృందం గవర్నర్ కాన్వాయ్‌లో వెళ్లనుంది. ఈ బృందంలో ఉస్మానియా ఆసుపత్రి నుంచి వచ్చిన గుండె వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్ ఫిజీషియన్లు, సర్జన్లు ఉండనున్నారు.



గవర్నర్ సందర్శించనున్న ఓబుల్‌కేశవాపూర్ వేంకటేశ్వరస్వామి దేవాలయం

గవర్నర్ వస్తున్నారని..

జనగామ కలెక్టరేట్ నుంచి ఓబుల్‌కేశవాపూర్‌కు గవర్నర్ వెళ్లేమార్గంలో చంపక్‌హిల్స్ వద్ద రోడ్లపై ఉన్న గుంతలను అధికారులు పూడ్చి వేయించారు. చంపక్‌హిల్స్ వద్ద బైపాస్ నిర్మాణం జరగాల్సి ఉండడంతో ప్రస్తుతం ఉన్న రోడ్డును కొంతకాలంగా పట్టించుకోలేదు. దీంతో పూర్తిగా గుంతలుగా మారింది. ఈ రోడ్డుపైనే ఎంసీహెచ్‌కు గర్భిణులు వెళ్తుంటారు. కొంతకాలంగా గుంతలను పూడ్చని అధికారులు గవర్నర్ వస్తుండడంతో ఆగమేఘాల మీద గుంతలను పూడ్చి, అవసరమైన చోట కొత్త బీటీ లేయర్ వేశారు. దీనితో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఓబుల్‌కేశవాపూర్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ట్రాక్టర్లతో మట్టిని తెచ్చి చదును చేశారు.

పార్టీ పటిష్ఠానికి పాటుపడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



జనగామలో మాట్లాడుతున్న దశమంత్‌రెడ్డి

జఫర్‌గడ్, ఆగస్టు 28 : బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పాటుపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి కోరారు. జఫర్‌గడ్‌లో బుధవారం ఆయన మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్, యుగంధర్‌రెడ్డి, తదితర నేతలతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో దశమంతరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బూత్‌కు 200 చొప్పున పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ బూటకమన్నారు. అలాగే అక్రమ నిర్మాణాల పేరుతో హైడ్రా కూల్చివేతలు ఓ డ్రామాగా పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఏర్పాటు పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ అగ్ర నేతలు పదవులు పొంది అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు బొజ్జపల్లి సుభాష్, రాజశేఖర్ గౌడ్, శివరాజు యాదవ్, అంజిరెడ్డి, కొంతం శ్రీనివాస్, ఎండి.వలీపాషా, పులి శ్రవణ్‌కుమార్, సింగారపు రమేశ్, టి.సురేశ్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుడా పేరుతో కుట్ర

జనగామ రూరల్: కూడా పేరుతో జనగామ ఎమ్మెల్యే కుట్ర పన్నుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో జనగామను కుడాలో విలీనం చేయాలని బీజేపీ డిమాండ్ చేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ అస్తిత్వము లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. జనగామ మునిసిపాలిటీలో కొన్ని గ్రామాలను విలీనం చేయాలని బీఆర్ఎస్ పభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. జనగామ మునిసిపాలిటీని కేంద్ర ప్రభుత్వం అమృత్ సిటీగా ప్రకటించినా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, హరిచంద్ర గుప్త, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మహేందర్

పాలకుర్తి, ఆగస్టు 28 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారతీయ జనతాపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ లెవల్లో బీజేపీ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కోరారు. ఈ ఏడాది నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాన్ని పెంచే విధంగా ప్రతి కార్యకర్తల పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్, రవి, పెంతల మహేందర్, వెంకన్న, పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత



బాధితుడికి నగదు అందిస్తున్న ఎస్సై నగేష్

నర్మెట, ఆగస్టు 28: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పోగొట్టుకున్న నగదును పోలీసులు తిరిగి అందజేశారు. నర్మెట ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన చింతకింది రమేష్ అక్కన్నపేట మండలంలోని ఖుషి వైన్స్ షాపులో పని చేస్తున్నాడు. ఈనెల 26న వైన్స్‌షాపుకు సంబంధించిన డబ్బులు రూ. 4,07,800 లక్షలను ద్విచక్ర వాహనం ట్యాంక్ కవర్‌లో పెట్టుకుని నర్మెట నుంచి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో నర్మెట శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత ప్రమాదవశాత్తు ట్యాంక్ కవర్‌లోని నుంచి నగదు జారి రోడ్డుపై పడి పోయింది. కొద్ది దూరం వెళ్లాక ట్యాంక్ కవర్‌లో చూడగా డబ్బులు కనిపించకపోవడంతో కంగారుపడ్డాడు. దీంతో విషయాన్ని వెంటనే వైన్స్‌షాపు యజమాని గోపగోని శ్రీధర్‌తో తెలిపాడు. ఇరువురు కలిసి వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నగేష్ సీసీ కెమెరాల ఆధారంగా డబ్బులు దొరికిన వ్యక్తిని గుర్తించి అతడిని విచారించగా నగదును రమేష్, వైన్స్‌షాపు యాజమాని శ్రీధర్‌లకు బుధవారం అప్పగించాడు.

మండల కార్యదర్శిగా కళింగరాజు

పాలకుర్తి, ఆగస్టు 28: సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ మండల కార్యదర్శిగా మండలంలోని దర్దెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గూడేల్లగూడెంనకు చెందిన కొనకటి కళింగరాజు ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని బస్‌స్టేషన్ ఆవరణలో ఆ పార్టీ మండల కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు.

మండల నూతన కార్యదర్శిగా కళింగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసేందుకు నిర్విరామంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు జీడి సోమయ్య, రజిత, మల్లన్న, సోమయ్య తదితరులు ఉన్నారు.

హైడ్రాను గ్రామ స్థాయిలో అమలు చేయాలి

పాలకుర్తి, ఆగస్టు 28 : చెరువులు, కుంటలను సహజ వనరుల పరిరక్షణ కోసం హైడ్రాను గ్రామ స్థాయిలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్‌ఎస్టేట్ రంగం పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని చెరువులు, కుంటలకు శాటిలైట్ సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా భూకబ్జాలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పార్టీ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ పోరాటాలు తీవ్ర తరం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య, తాళ్లపల్లి మల్లయ్య, పోలాస సోమయ్య, దుస్సా శివప్రసాద్, కళింగరాజు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, ఆగస్టు 28: మండలంలోని వీఎస్ఆర్ నగర్ గ్రామానికి చెందిన కలియా శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి రూ. 5 వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి బుధవారం అందించారు. ప్రతి వ్యక్తి ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మంచి లక్షణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నల్లనాగుల వెంకటాచారి, కాలియా చిట్టిబాబు, గొడుగు కమలాకర్, పిట్టల శ్రీనివాస్, చవాన్ నరేష్, సిలివేరు భిక్షపతి, కట్కూరు గ్రామ శాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, బొజ్జ వెంకటేశ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి వైభవంగా రథోత్సవం



భక్తుల దర్శనార్థం స్వామివారిని రథంపై ఊరేగిస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, ఆగస్టు 28: శ్రీకృష్ణ రథోత్సవ వేడుకలు బుధవారం జఫర్‌గడ్‌లో వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణాష్టమి మరుసటి రోజున మండల కేంద్రంలో ప్రతీ ఏటా శ్రీకృష్ణుడు, శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించిన రథంపై ఉంచి భక్తుల సందర్శనార్థం పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో రథంపై ఉన్న దేవుళ్లకు ఆయా వీధుల్లో మహిళలు, భక్తులు స్వాగతం పలికి మంగళహారతులు సమర్పించారు. మంగళవాయిద్యాలతో స్వామి వారిని వివిధ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక గాంధీ సెంటర్‌లో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణుడు రేపల్లెలో గోపెమ్మలు ఉట్లపై దాచుకున్న పెరుగు, వెన్నను దొంగిలించాడన్న మధుర ఘట్టాన్ని గుర్తుకుతెస్తూ ఈ ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉల్లాసభరితంగా నిర్వహించారు.

ఆకర్షించిన స్తంభం జారుడు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండల కేంద్రంలో గాంధీ సెంటర్ వద్ద ముదిరాజ్ కులస్థులు నిర్వహించిన స్తంభం జారుడు కార్యక్రమం విశేషంగా ఆకర్షించింది. శ్రీకృష్ణుడి బాల్య క్రీడా చేష్టలకు గుర్తుగా వినోద కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 60 అడుగుల ఎత్తులో ఉన్న కర్ర స్తంభంపైకి ముదిరాజ్ యువకులు ఎక్కి జారడం, స్తంభంపైన చివరలో గల ముడిని అందుకోవడానికి యువకులు పలు మార్లు ప్రయత్నిస్తూ కిందికి జారిపోవడం వంటి దృశ్యాలు విశేష సంఖ్యలో హాజరైన ప్రజలు ఆసక్తిగా తిలకించి హర్షధ్వానాలు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

దేవరుప్పుల, ఆగస్టు 28: తండ్రి మందలించాడని మనస్థాపం చెంది క్షణికావేశంలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవరుప్పుల మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన జోగు మైసయ్య జయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శ్రీకాంత్-(28)ను ఉన్నారు. కుమారుడు ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా తోటి స్నేహితుల వలే నీవు కూడా ఏదైనా పని చేసుకోవచ్చుకదా.. అని తండ్రి మైసయ్య కుమారుడిని మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన శ్రీకాంత్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడు తండ్రి మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు.

కుక్కల బెడదను నివారించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 28: డివిజన్ కేంద్రంలోని ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డుపైన కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తిపోతున్నామని కుక్కల బెడదను నివారించాలని స్థానికులు వాపోతున్నారు. బుధవారం డివిజన్ కేంద్రానికి చెందిన నాయకులు కలకోల యాదగిరి, సోమయ్య, గట్టు రాము, ప్రవీణ్‌కుమార్, బోనగిరి విద్యాసాగర్‌లు మాట్లాడారు. రోడ్డు పైన నిత్యం కుక్కలు అటు ఇటుగా కుక్కలు పరుగెత్తడంతో తరుచుగా వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయని వాపోయారు. కుక్కల బెడదను నివారించాలని కోరుతూ ఈవో సత్యనారాయణకు ఫిర్యాదు చేయగా తన పరిధిలో లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వారు తెలిపారు. అనంతరం గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో వెంకన్నకు సమాచారం అందించగా ఒకటి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు కానీ అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మురళి, వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమం

లింగాలఘణపురం, ఆగస్టు28: రైతు రుణమాఫీ పథకంలో అర్హత కలిగి ఉండి రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాలను గుర్తించేందుకు బుధవారం లింగాలఘణపురం మండలంలోని బండ్లగూడెంలో ఫ్యామిలీ నిర్ధారణ కార్యక్రమం మొదలైంది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుణమాఫీ పథకంలో అర్హులై రేషన్ కార్డులు లేని వారు మండలంలో 368 మంది ఉన్నట్లుగా గుర్తించారు. ఇందుకోసం ఈనెల 28 నుంచి ప్రతీ గ్రామంలో గుర్తించిన 368 కుటుంబాలకు చేరుకుని అధికారులు ఫ్యామిలీ నిర్ధారణ చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే సంబంధిత కుటుంబాల నుంచి ఫ్యామిలీ ధృవీకరణ పత్రాలను సమర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు స్పందన, శ్రీనివాస్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

● తరిగొప్పుల: రుణమాఫీ పథకంలో అర్హత కలిగి ఉండి రేషన్ కార్డులేని రైతుల నుంచి వివరాలను వ్యవసాయ అధికారులు బుధవారం దరఖాస్తుల ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారిణి జనగామ ఏడీఏ బీనా బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వారు సేకరించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవో కమల, ప్రశాంత్, రేష్మ పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి



జఫర్‌గడ్‌లో అమరుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

జనగామ రూరల్, ఆగస్టు28: సీపీఎం పోరాటంతోనే రైతులకు ఉచిత విద్యుత్‌ను మాజీ సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఇవ్వడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి అన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాములకు సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో విద్యుత్‌ను ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నించారన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు, పేదలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆరు నెలల పాటు పోరాటాలు చేయడం జరిగిందన్నారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఛలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలపై కాల్పులు జరపడంతో రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాములు అమరులు అయ్యారన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యుత్‌ను అంబానీ, అదానికి అప్పజెప్పి దేశాన్ని అంధకారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో చందు నాయక్, కళ్యాణం లింగం, మంగ బీరయ్య, పల్లెల లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : విద్యుత్ పోరాటంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌లకు బుధవారం సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజల పక్షాన ఉద్యమిస్తున్న వారిపై నాటి నుంచి నేటి వరకు ఉక్కుపాదం మోపటం పాలకులకు పరిపాటయ్యిందన్నారు. కార్యక్రమంలో రామగళ్ల అశోక్, రాములు, రాజవ్వ, బలరాములు, ఐలయ్య, సులోచన, మాదవి, లక్ష్మి, రమ తదితరులున్నారు.

● జఫర్‌గడ్: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరుల సంస్మరణ దినోత్సవాన్ని సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జఫర్‌గడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నక్క యాకయ్య, రామన్న, అజయ్, దుడ్డుల రాజు,.చ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ అమరు సంస్మరణ దినోత్సవంలో భాగంగా సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ఆధ్వర్యంలోని నాయకులు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిగెల రమేష్ మాట్లాడుతూ బషీర్ బాగ్ చౌరస్తా సంఘటనతోనే ఉచిత విద్యుత్ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో దైద రాములమ్మ, మంద మహేందర్, వంగపండ్ల సోమయ్య, పొలాసు కిష్టయ్య, మందపురం అంజయ్య, సాంబయ్య, పిట్టల శ్రీనివాస్, రాంరెడ్డి, రాజు, అశోక్, యాకయ్య పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వృథాకావు

పాలకుర్తి: బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిధిగా రాజు హాజరై మాట్లాడారు. ప్రజా అవసరాల కోసం విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం దళిత, బహుజనుల స్వంత భూములను సబ్‌స్టేషన్ నిర్మాణం ఇస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. ఏళ్లు గడుస్తున్న ఉద్యోగం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు ఆ ఇంటిలో ఎవరికి కూడా ఉద్యోగం ఇచ్చిన పాపానపోలేదని విమర్శించారు. సమావేశంలో చిట్యాల సోమన్న, జి. అమృతారెడ్డి, రామ్మూర్తి, వెంకటరమణ, యాకన్న ఉన్నారు.